# రగిలిన పగ

రచన:
యస్. రామమోహనరావు

ఏమె! లచ్చి! ఇంకా నువ్వు గడ్డికోసుకోటం కాలేదటే! అన్నాడు ఆగ్రామ మునుసబు రంగయ్య, పొలమునుంచి వస్తు కాల్వ ఒడ్డున గడ్డితరుక్కుంటున్న లచ్చితో.

నేదు! దొరగారు. ఇయ్యాల కూసింత అలస్యంగావత్తినేమో! ఎంతసేపు తొయ్యినాకూడా మోపుగడ్డి కాలేదండి.

అలస్యంగా ఏందుకొచ్చావే! రోజు సద్దితిని బయలుదేరేదానవు, అన్నాడు తన బుర్రమీసాలు మొలవేస్తు యమధర్మరాజు ఆకారం లాంటి తన ఆకారానికి మురిసిపోయి లచ్చివంక ఆశగా చూస్తు!

ఇయ్యాల. నిన్న పట్నంనుంచితెచ్చిన రాగుల్లో కూసిన మిగిలాయి, అయి మా అవ్వ, నాకు కూత్తింత సంగటికనే బెట్టుకొని తినివచ్చేప్పటికి ఇయ్యాలయినదయ్యాగోరు.

రైతులంతా అప్పటికే యింటికి బయల్దేరారు. సమీపంలో, నరసంచారములేదు. పచ్చని పొలాలు, వంటరి ఆడది, అందులో నవయువ్వన పల్లె యువతి, రంగయ్యగారికి వాతావరణం ఏదోగా అనిపించి......

"నాకు తెలియక అడుగుతా. నీకు ఇంత కష్టపడవలసిన అవసరం ఏముందే! ఏదో! నేనున్నానుగా, నీదగ్గర పైకము లేకపోతే నేసర్దుతాగా, ఇంత ఇబ్బందిపడాల్సిన అవసరంలేదు. అని తన సానుభూతినిదెల్పి, తనచేతిలోని దుడ్డుకర్రను అనుకొని విలాసంగా. చుట్ట నోట్లోపెట్టుకొని, కళ్ళు చిట్లించుకొని, తమాషాగా నవ్వుతు అన్నాడు, బీదవాళ్ల కడుపుకొట్టే మునుసబు రంగయ్య.

బాబుగారు! మనము కష్టపడాలి, కష్టపడి సంపాదించుకోవాలి, తేరగా వచ్చిందని తింటే, ఎట్టా అరుగుద్ది అయ్యగోరు! అంది లచ్చి తన చక్రాల వంటి కళ్ళను గుండ్రముగా త్రిప్పుతూ, పమిటను రొమ్ములపైకి సర్దుకుంది, మునసబు తీక్షణమైన చూపులకు తట్టుకోలేక.

తన కాయాన్ని, విలాసంగా తిప్పి, 'లచ్చి! నీ అవ్వ చచ్చిపోతే ఎవరే దిక్కునీకు! ఏదో! నాదగ్గిర ఉన్నావంటే నాకు అనందంగా ఉంటుంది. నీకు జరుగుబాటు సరిగాజరుగుతుంది. అంతే కాని కష్టపడాలి అంటే, నీ యవ్వన మంతా అడివిలో కాచిన వెన్నెలవలె అయిపోతుంది. నామాటవిను, నువ్వు నాదానిగా ఉన్నావంటె రాజభోగముల ననుభవిస్తవే లచ్చి! వీలుంటే సందకాడ మనింటికి ఒకసారి రా! నీ కోసం కాచుకొనుంటా ఏమంటావ్! అలోచించుకో! వస్తా! అని అక్కడినుండి యముడిలాగా తరలిపోయాడు రంగయ్య.

లచ్చి రంగయ్య వెల్తుంటే చూస్తు, వెళ్లినతరువాత, తనచేతి మెటికలు విరుస్తు "దొంగ సచ్చినోడు! ఈడిసిగ తరగ. ఈడినుండికదూ, అమ్మ నాయనా నాకు లేకుండా పోయినారు. ఈడు నిరువుగప్పిన నిప్పులాటోడు. ఈడిదగ్గిర జాగ్రత్తగా వుండాలి. వీడికి తగినట్టుగా బుద్ధిచెప్పాలి, ఇట్టివాళ్లువుంటె గ్రామానికే చేటు అమ్మా నాన్నను పొట్టను పెట్టుకున్నది చాలక నన్నుకూడ నాశనం చేయ తలపెట్టాడు సరేచూద్దాం! అని మనస్సులో అనుకొని గడ్డిమోపు తలకెత్తుకొని, ఒయ్యారంగా నడచుకుంటూ బస్తివేపు వెళ్లిపోయింది.

లచ్చి ఒక మధ్యతరగతి కుటుంబీకుడైన రామయ్య కూతురు. తనకు గల పొలంతోపాటు ఎవరివైన పొలాలు కవులుకు చేస్తుండేవాడు. దయార్ద్ర హృదయుడు, సౌమ్యుడు. ఒకరితో నిమిత్తంలేకుండా తనపని తాను చేసుకుపోతుండేవాడు. ఇటువంటి రామయ్యను చూస్తె రంగయ్య కెందుకో గిట్టదు. అతన్నిచూస్తె కళ్ళలో నిప్పులుపోసుకుంటాడు.

ఒకరోజు రామయ్య తన తల్లినితీసుకొని పొరుగూరు పోయినాడు. లచ్చి అయిదేండ్లపిల్ల! లచ్చితల్లి సీత. చక్కదనాల కుప్ప. ఊళ్ళోకల్లా అమె సౌందర్యం సాటిలేనిది. సీత సౌందర్యానికి తగ్గట్టు సచ్చరిత. సీతపై ఏనాడో కన్నువేశాడు మునసబు రంగయ్య! సమయంకోసం యెదురుచూస్తున్నాడు. రామయ్య ఊరెళ్ళాడని తెలుసుకున్నాడు. సీత తనపిల్లను పక్కనపెట్టుకొని పడుకొంది. ఆరోజు అమావాస్య. కటిక చీకటి అలముకుంది. కన్ను పొడుచుకున్నా కనిపించటంలేదు. చల్లని గాలి వీస్తుంది. గ్రామమంతా నిద్దరోతోంది. అటువంటి సమయంలో, రామయ్య యింటితలుపు కొట్టిన చప్పుడు వినబడింది. "సీత" ఆ! ఆ! వస్తున్నా, అని లేచివెళ్లి తలుపుతీసింది. తీసిందే తడవుగా విసురుగా రంగయ్య లోపలికి నెట్టుకొచ్చి, తలుపు లోపల గడియ పెట్టాడు. సీత అరవబోయింది. కానీ యముడులాగా రంగయ్య, తన బలమైన చేత్తో సీత నోరునొక్కి "సీతా! అరవకు. ఎన్నినాళ్ళనుండో నీమీద మనస్సుగా ఉంది. యీనాటికి అదను చిక్కింది. నా కోరిక తీర్చు అన్నాడు. సీత బెదరుతో "రంగయ్యా! నీవు నాకు అన్నయ్యలాంటివాడివి. దయచేసి ఈ చెల్లెలను పాడుచేయక వదలిపెట్టు,

అంటు ఎంతో ప్రాధేయపడింది. కాని కామాంధకారము కరుడుకట్టిన రంగయ్యకు ఆ ప్రార్థనలేవి వినిపించలేదు. తన పశుబలముతో ఆమె మానాన్ని హరించాడు. అబల, అవమానము భరించలేక ఆత్మహత్య చేసుకుంది. ఈ సంగతి తెలుసుకున్న రామయ్య, రంగయ్యను హత్యచెయ్యడానికి వెళ్ళాడు. కైజారు తీసుకొనివెళ్లి తీరా పొడవపోయే సరికి ఏదో చప్పుడై రంగయ్య మేల్కొని రామయ్యను పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. ఫలితం, రామయ్య జన్మాంతర కారాగారశిక్ష. అశిక్షలోనే హృద్రోగమువల్ల రామయ్య చనిపోయాడు.

అప్పటినుండి తల్లి, తండ్రిలేని లచ్చిని ముసలితల్లి మంగమ్మ పెంచుతుంది. లచ్చికి పందొమ్మిది సంవత్సరాలు చూస్తు ఉండగానే గడిచిపోయాయి. లచ్చి అచ్చం తల్లిపోలిక. చంపకు చారడేసికళ్ళు. కోలముఖము, కోటేరులాంటి ముక్కు ఎటువంటివాడినైనా ఆకర్షిస్తాయి. పేదతనమువల్ల లచ్చి ప్రతిదినము గడ్డికోసుకొనిపోయి బస్తీలో అమ్మి, అవచ్చినడబ్బుల్తో తిండిగింజలు కొని, తానుతెచ్చిన నూకలతో అవ్వ గుట్టుగా కాపురము గడుపుకుంటున్నారు. అటువంటి లచ్చిమీద రంగయ్య కన్నుపడింది.

లచ్చి గడ్డి అమ్మి సాయంత్రానికి ఇల్లు చేరుకుంది. తనుతెచ్చిన నూకలడు సంకటి వండింది. తుక్కిమంచములో పడుకున్న అవ్వ లచ్చినిచూచి 'లచ్చి' ఎందుకే యీయాల ఇంత ఆలస్యము అయినాది. రోజు పెందలకడే ఇంటికి వచ్చేదానివి. ఇయ్యాలదాకా రాకుండా ఏంచేస్తుండావో? నీవు సచ్చికాలం పిల్లవు. పెందలాడే ఇల్లుచేరుకో! అన్నది.

ఆదిగాదే అవ్వ! "ఆ ముసలిపీనుగ, దొంగ సచ్చినోడు మూలంగా అలస్యమైంది. లచ్చి! లచ్చి! అని ఒకటేగోల. వాడి కడుపుకాల" వాడి సిగతరుగు అంది.

"ఎవరే అడు!" అంది అవ్వ.

"వాడేనే అవ్వ" అ మునసబు రంగయ్యాగాడు. అమ్మానాన్నను కాజేసిందిగాక నన్ను పాడు చేయటానికి చూస్తున్నాడే.

అవ్వ ఉలిక్కిపడి "అడికళ్లలో నీవు పడ్డావటే నా తల్లి! అదు మాయవాడే తల్లి! అడిదగ్గర జాగ్రతగా మసులుకో అని అంతవరకు లచ్చికి చెప్పకుండా ఉంచిన లచ్చి తల్లి - తండ్రులకథను లచ్చియెదుట ఏకరువు పెట్టింది, ఆ నిర్భాగ్యురాలు ముసిల్ది.

లచ్చి తోకతొక్కిన త్రాచువలె బుసగొట్టింది, రోషావేషాలతో ఆమె ముఖము కందగడ్డలా మారిపోయింది. పళ్ళు పటపట కొరుకుతూ, కళ్ళు చిటపట చిట్లించి పగపట్టింది.

ప్రొద్దుట రంగయ్య పొలందగ్గర కనపడి అన్నమాటలు, లచ్చిమస్తిష్కంలో మెదలింది. ఏదో ఆలోచించి ఓ నిశ్చయానికి వచ్చి తన గడ్డికోసుకొనే కొడవలి, బొడ్డులో అదుముకొని, రంగయ్య ఇంటివైపు దూసుకుపోయింది సంధ చీకట్లో......

లచ్చినిగురించి ఏవేవో కలలుగంటూ పలుఊహలతో ఆశాసౌధాలను నిర్మించుకుంటున్న రంగన్నకు, ఎవరో తలుపు కొట్టిన చప్పుడు వినబడగా తన ఆలోచనలకు స్వస్తిచెప్పి చటుక్కున లేచివెళ్లి తలుపు తెరచాడు. తలుపుతీయగానే, కళ్ళు జిగేలనేటట్లుగా లచ్చి కనిపించింది.

ఏమే లచ్చి ఇంతాలస్యంగావచ్చావు? ఎప్పట్నుంచో నీ రాకకోసం యెదురు చూస్తున్నా. ఇక నీకష్టాలు గట్టెక్కాయి సుఖం పొందబోతున్నావు. నీవు తెలివిగలదానవే లచ్చి! రా! ఇటు మంచం మీద కూర్చో అంటూ మీదకువచ్చి లచ్చిని తన బాహువులలో బంధించివేశాడు 'పంజరములో పడ్డ చిలకలాగా' గిల, గిలా తన్నుకున్నది లచ్చి కాని, ఫలితం లేకపోయింది. అయినా ధైర్యంతో లచ్చి బలవంతముగా, అతని బాహువులనుండి బయటపడి, ఏంది దొరగారు, ఇంత తొందరపాటు, కాస్త మాటా, మంతి లేకుండా అమాంతంగా మీదపడటమే అని లచ్చి ఒయ్యారం ఒలకబోస్తు సిగ్గుగా తల వంచుకుంది.

లచ్చి నిన్నుచూడగానే, నా మనసు గగనవిహారానికిపోయిందే, నీ అందం ముందు, సినిమాతారలు కూడా దిగదుడుపేనే, నీ పొంగివచ్చె యవ్వనపు శోభలలో నన్ను తేలాడేట్లు చెయ్యవే లచ్చి! అబ్బా! రా! లచ్చి అంటూ రంగయ్య కళ్లు మూసుకుంటూ తన్మయత్వముతో, లచ్చిని కావిలించుకోటానికి వచ్చాడు. దగ్గిరకురాగానే, లచ్చి సమయము చూసుకొని, తన దగ్గిరున్న కొడవలితో రంగయ్య మెడమీద వేటు వేసింది. అంతే రంగయ్య పాపం పండింది. అబ్బా! అంటూ నేలకొరిగాడు. ముఖాన ఉమ్మేసి ఛీ! అని లచ్చి ఆ చీకట్లో మాయమయి పోయింది. అంతే — రంగయ్య అరుపుకు చుట్టు ప్రక్కవాళ్లు పరుగెత్తుకొచ్చారు. రంగయ్య శవం, రక్తపుమడుగులో స్నానంచేసింది.

అక్కడ చేరినవారు, పలురకాలుగా గుసగుసలాడెదరు. పైకనకపోయినా కొంతమంది అనందించారు. దూరంలో సందాకవళపువాళ్ళు తత్వం పాడుతున్నారు. "ఎవరుచేసినకర్మ వారనుభవించక ఎవరికైనా తప్పదన్నా"-అన్నా అని. ★